# అమ్మాయి నవ్వితే!



వేగి నాగరాజు

**సురేష్** విజయనగరం నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులోంచి గురుద్వార్ బస్టాపు వద్ద దిగాడు. దిగీ దిగగానే సెల్‌ఫోన్ మ్రోగింది. ఫ్రెండ్ కరుణాకర్ ఫోన్. ఫోన్ మాట్లాడడము అయ్యింది. మరలా మరొక ఫ్రెండ్ ఫోన్. ఫోన్లో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఆ బస్టాపుకు ముగ్గురు అమ్మాయిలు సురేష్ వైపు చూస్తూ, వారిలో వారే నవ్వుకోసాగారు. కాని సురేష్‌కు ఆ నవ్వులు ఇతని వైపు చూసే నవ్వారని అనుమానమొచ్చింది. చుట్టూ ప్రక్కల చూశాడు డౌట్ లేదు! తనని చూసే వాళ్ళు నవ్వుతున్నారని డిసైడ్ చేసుకొని ఫ్రెండుని బైక్ తీసుకొని రమ్మని ఫోన్ చేశాడు.

ఇంతలో 38 నెంబరు బస్సు వచ్చింది. ఆ ముగ్గురమ్మాయిలు సురేష్ వైపు చూస్తూ, నవ్వు మొహాలతో ఓ చిరునవ్వు పారేస్తూ బస్సు ఎక్కారు. ఒక ప్రక్క సురేష్‌కు టెన్షన్ పెరగసాగింది. ఎంత గుర్తు చేసుకున్నా గుర్తు రాలేదు. ఎక్కడా వారిని చూసిన పాపాన పోలేదు. ఎవరు? ఎందుకు? ఆ ముగ్గురమ్మాయిలు తనని చూసి నవ్వుతున్నారు. ఆలోచనలు ముడివీడలేదు. రెప్పపాటు కాలంలో బస్సు బయలుదేరబోతుంది. చటుక్కున సురేష్ ఆ బస్సు ఎక్కేశాడు. తన ఫ్రెండ్‌కి మరలా ఫోన్ చేసి ఎక్కడికి రావాలో సెల్‌ఫోన్‌లో డైరెక్షను యివ్వసాగాడు.

బస్సు ఆర్.టి.సి. కాంప్లెక్సు వద్ద టర్నింగ్‌లో రెడ్ సిగ్నల్ పడగానే ఆగింది. ఆ ముగ్గురు అమ్మాయిలు అక్కడ దిగేశారు. సురేష్ కూడా దిగేశాడు. ఇంతలో అతని ఫ్రెండ్ కిరణ్ కుమార్ కూడా బైక్ మీద వచ్చేశాడు. ఇంకా ఆ అమ్మాయిలు ఇతని వైపు చూస్తూ నవ్వుకుంటున్నారు.

తన ఫ్రెండ్ కరుణాకర్ రాగానే సురేష్ రెచ్చిపోయి, ఆ అమ్మాయిల వైపు చూస్తూ, దగ్గరికి వెళ్ళి రకరకాల వింత చేష్టలు, వెకిలి చేష్టలు అసభ్య పదజాలముతో నానా యాగి చేశారు. ఇతని వాలకం చూసి, ఆ అమ్మాయిలు సైలెంట్ అయిపోయారు. ఆ అమ్మాయిల ముఖాలు మాడిపోయాయి.

సమాజం సిగ్గు పడే విధంగా ఆ సురేష్, కిరణ్‌కుమార్‌లు ప్రవర్తించారు. ఆ అమ్మాయిలకు కోపమొచ్చి ప్రక్కనున్న ఎస్.టి.డి బూత్ వద్దకు వెళ్ళి ఎవరికో ఫోన్ చేసి వెయిట్ చేయసాగారు. ఓ అరగంట ఆ ముగ్గురు అమ్మాయిలు అక్కడే వాళ్ళ అల్లరి భరిస్తూ కాలక్షేపం చేయసాగారు.

ఇంతలో పోలీస్ మొబైల్ స్క్వాడ్ వేన్ ఆ అమ్మాయిల ముందు ఆగింది. ఆ అమ్మాయిలు ముగ్గురూ సురేష్, కరుణాకర్‌వైపు వేలు పెట్టి చూపించారు. సురేష్, కిరణ్ కుమార్‌లకు ఒంటి మీద తెలివి వచ్చి చూసే సరికి టపటపమని లాఠీదెబ్బలు పడి ఒళ్ళు హూనం చేసి బట్టలు విప్పదీయించి మొబైల్ స్క్వాడ్ వేన్ ఎక్కించి పోలీస్ స్టేషను తీసుకొని వెళ్ళారు.

దెబ్బలు తిన్న వాళ్లమీద జాలితో మరలా ఆ అమ్మాయిలు సురేష్ అన్నయ్యకు జరిగింది అంతా చెప్పి స్టేషను వెళ్ళి విడిపించుకోమని చెప్పారు.

సురేష్ అన్నయ్య, ఆ ముగ్గురు అమ్మాయిలు పోలీస్ స్టేషనుకి వచ్చి ఎస్సైగారికి చెప్పి, ఇక ముందు ఇలా చేయము అని పూచీకత్తు వ్రాయించుకొని, ఆ అమ్మాయిలు కేసు విత్‌డ్రా చేసుకున్నట్లు సంతకాలు చేయించుకొని సురేష్‌ను కరుణాకర్‌ని విడిచిపెట్టారు.

బిక్కమొహాలతో, సిగ్గుతో తలవంచుకొని స్టేషను బయటకు వచ్చి నిలబడ్డారు.

"ఏదో ఫ్రెండ్ తమ్ముడివని నిన్ను చూసి నవ్వితే, నాకే వీళ్ళు లైన్ వేశారని అనుకొని పెద్ద అందగాడిలా పోజుపెట్టి, వాళ్ళని నానా యిబ్బంది పెట్టి, అల్లరి చేస్తుంటే ఎవరైనా పూరుకుంటారా! ఛీ...ఛీ... మనిషై పుట్టాక సిగ్గు, లజ్జ వుండాలి. అచ్చోసిన ఆంబోతులా పూరి మీద పడి కనిపించిన ప్రతి అమ్మాయిని ఏడిపించడం నీకు ఈ మధ్యనే అలవాటయ్యినట్టుంది. ఇకనైనా యిలాంటి వెకిలి చేష్టలు మాని బుద్ధిగా వుండడం నేర్చుకో. వీళ్ళు నా క్లాస్‌మేట్స్. మనింటికి ఒకసారి వచ్చారు. నీకు గుర్తు లేనట్టుంది. అయినా నీకు ఎలా గుర్తుంటుంది చెప్పు! పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందట" అంటూ చీవాట్లు పెట్టాడు సురేష్ అన్నయ్య.

ఏదో తెలిసిన ముఖం కదాని ఏ అమ్మాయి అయినా చూసి నవ్వితే ఆ అమ్మాయి తననేదో లైక్ చేస్తుందనుకొని మూర్ఖంగా ముందుకెళ్ళి సైట్ కొట్టి కటకటాలపాలవుతారు ఈనాటి యువతరం కుర్రాళ్ళు. ❋